# మంచు తెరలు!

రచన : శ్రీ మంతెన సూర్యనారాయణరాజు, ఎం.ఏ.



(రచయిత)

'భానూ! ఓ భానూ! ఏం చేస్తున్నావే లోపల' అంటూ పిలిచింది శాంతమ్మ కూతుర్ని.

'చదువుకుంటున్నానమ్మా!'

'క్లాసు పుస్తకం చదువుకుంటున్నావా! నవలేదైనా చదువుతున్నావా?'

'.........'

'నిన్నే మాట్లాడవేం?' అని గద్దించింది శాంతమ్మ.

'క్లాసు పుస్తకమే!'

'ఒకసారిలారా!'

'దేనికి?' అంటూ విసుక్కుంటూ తల్లి దగ్గర కొచ్చింది భానురేఖ!

'భానూ! ఈ కేన్‌లో గోధుమలున్నాయి తీసికెళ్ళి పిండి ఆడించుకురావూ? ఇంట్లో నాకు బోలెడంత పనుండి. ఇవ్వాళ శనివారం అందరికీ ఒంటిపూట భోజనమాయె! సాయంకాలం టిఫిన్ చేయాలిగా అందుకని చపాతీలు చేద్దామంటే ఆడించిన పిండి అయిపోయింది. కొద్దిగా వున్నా అది సరిపోదు. నాన్నగారొచ్చే లోపల నువ్వు చక్కా వచ్చేయాలి సుమా! ఆలస్యం చేసావో ఆయనతో పడలేం! ఆఫీసునుంచే ఆకలి...ఆకలో అంటూ అవురావురుమంటూ వచ్చేస్తారు' అంది.

'ఆలాగేనమ్మా!' అంటూ తల్లి అందించిన కేన్ అందుకుంది భాను.

'ఇందా రెండు రూపాయలు అరగంటలో నువ్వొచ్చేయాలి ఇక్కడున్నట్లుగా!'

'అలాగే!' అంటూ భానురేఖ వెళ్ళిపోయింది.

o o o

శాంత అంట్లు కడగటం పని పూర్తిచేసుకుని సాయంకాలం ఐదు గంటలవేళ వాకిలి ఊడ్చి కూతురు రాకకోసం గడపలో నిలబడి ఎదురు చూడసాగింది. భర్త శ్రీనివాసమూర్తి ఆఫీసునుండి బకాసురుడిలా ఇంటివైపు వస్తున్నాడు. అయ్యయ్యో! అనుకున్నంత పనీ అయ్యింది. ఇప్పుడు ఆకలని తప్పకుంటా అంటారు. ఏ రకేమని సమాధానం చెప్పాలి. ముందుగా కాస్త కాఫీ పెట్టిస్తే కాస్సేపు ఓపిక పడ్తారేమో'నని లోనికెళ్ళిపోయింది.

శ్రీనివాసమూర్తి లోనికొచ్చి బట్టలు మార్చుకుని ఈజీ చెయిర్‌లో కూర్చుని పేపర్ తిరగేయసాగాడు.

శాంత పొగలు కక్కుతున్న కాఫీ భర్త కందించింది.

మాట్లాడకుండా కప్పు ఖాళీచేసి భార్య కందిస్తూ 'ఏమిటోయ్! అమ్మాయి కనిపించటంలేదు. ఎక్కడి కెళ్ళిందేమిటి! ప్రిపరేషన్ హాలీడేస్ పుణ్యమా అని నవల్స్ వేసుకునిగాని కూర్చుంటోందా! దేనికి బదులు చెప్పవేం! బెల్లం కొట్టిన రాయిలా' అంటూ నిలదీసాడు.

ఆమె మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ 'అబ్బే! లేదండీ! అమ్మాయి లోపల బుద్ధిగా చదువుకుంటోంది' అంది

అప్పుడే పిండి ఆడిపించుకుని కేన్‌తో భాను లోపలి ప్రవేశించింది.

శాంతమ్మ గుటకలు మింగింది. శ్రీనివాసమూర్తి కుమార్తెను చూసి భార్యతో 'ఇదెక్కడనుంచి ఊడిపడిందోయ్

లోపల చదువుకుంటుందని చెప్పావు' అంటూ దీర్ఘం తీసాడు.

'అది నేను చెబుతానుండు నాన్నా! ఇవ్వాళ శనివారం కదా! అమ్మ రాత్రికి చపాతీలు టిఫిన్‌గా చేద్దామని గోధుమలు పిండి ఆడించుకురమ్మని పంపించింది వెళ్ళాను' అంది భాను ఎక్కడా తడుముకోకుండా శాంతమ్మ గుట్టు బైట పడినందుకు ముఖం చాటేసుకుని కేన్ తీసుకుని లోనికెళ్ళిపోయింది.

'శ్రీనివాసమూర్తి కుమార్తెతో 'బాగుందిరా అమ్మడూ మీ అమ్మకు ఎన్నిసార్లు చెప్పినా బుద్ధి రావడంలేదనుకో! లేకపోతే నీకు పరీక్షలు దగ్గర పడ్డాయని తెలుసు గదా! ఇలా ఆ పనీ ఈ పనీ చేస్తూ కూచుంటే పాసయ్యేదెలా! ఏదో ఆఖరి సంవత్సరం డిగ్రీ కాస్తా చేతికొస్తే నా బాధ్యత కొంత తీరుతుందని నేను అనుకుంటుంటే మీ అమ్మ ఇటువంటి పనులు చెప్పి నీటైం పాడుచేస్తోంది' అన్నాడు.

భార్యవున్న గదిలోకి వెళ్ళిపోయింది భానురేఖ. ప్రక్కింటాళ్ళ అబ్బాయి అక్కడికొచ్చి 'అంకుల్! అక్క యేం చేస్తోంది?' అని అడిగాడు.

'దానితో నీకేం పని చెప్పు?' అంటూ గుడ్లురిమాడు మూర్తి.


'పనంటే పనికాదులే అంకుల్ ప్లీజ్! ఒక్కసారి పిలు' అంటూ ప్రాధేయ పూర్వకంగా అడిగాడు.

'అమ్మా భానూ! నీ కోసం ప్రక్కింటాళ్ళ రాంబాబు వచ్చాడు' అంటూ పిలిచాడు.

భాను పరిగెట్టుకుంటూ అక్కడికొచ్చి లేని కోపం తెచ్చిపెట్టుకుంటూ 'ఎందుకు రాంబాబూ! పనిలేదా నీకు. మాటిమాటికీ నా దగ్గరకు రావద్దని నీ కెన్నిసార్లు చెప్పాను' అంది ముక్కెగరేస్తూ.

'అది కాదక్కా! మా అమ్మగారి కేదో పుస్తకం యిస్తానన్నావట! అమ్మ అడిగి తీసుకురమ్మంది. అందుకె చదువుకుంటూ మధ్యలో నీ దగ్గర కొచ్చాను' అన్నాడు బెంబేలు పడిపోతూ.

'అబ్బే! నేనేం పుస్తం యిస్తానని మీ అమ్మగారితో చెప్పలేదే' అంది.





'అమ్మాయ్! ఎందుకా బుకాయింపు. ఎబ్బే నీ వరస మారినట్టులేదు. నువ్వా నవల్సు చదవటం మానవు. మనిషి ఎదిగిపోయావు గాని ఎన్ని నవల్సు చదివినా నీ మనస్సు మాత్రం యెదగలేదు. ఎందుకన్ని అబద్ధాలాడతావు మీ అమ్మకిలా! ఆ ఇస్తానన్నాదేదో తొందరగా రాంబాబు కిచ్చి పంపు. చదువుకొని అతడైనా బాగుపడతాడు' అన్నాడు మూర్తి.

గత్యంతరంలేక ఒక పుస్తకం తీసుకొచ్చి రాంబాబుకిచ్చి పంపించింది. శాంత అక్కడికొస్తూ 'ఏవండీ! టిఫిన్ రెడీ అవుతోంది లోనికొస్తారా అమ్మాయీ మీరూ!' అంది.

'ఆహా! నిక్షేపంలా వస్తాం! అమ్మాయి భానూ నవమ్మా టిఫిన్ తిని చదువు కంబైండ్‌గా మొదలెట్టొచ్చు!' అంటూ కుమార్తెతో సహా లోనికెళ్ళాడు.

O O O

పరీక్షలయిపోయాయి. భానురేఖ పరీక్షలన్నీ బాగా వ్రాసింది. బి.యస్.సి. ఫస్టుక్లాసు గ్యారంటీ అని తండ్రికి చెప్పింది. కాలేజీ మూసివేసారు. రోజులు ఖాళీగా గడపడం ఇష్టంలేక టైప్ ప్రాక్టీసు చెయ్యడం మొదలెట్టింది. తీరిక సమయాల్లో నవలా పఠనం మాపలేదు. అలాగని తల్లికి సహాయం చెయ్యడం మానలేదు. నెలా పదిహేను రోజుల్లో పరిక్షా ఫలితాలు వెలువడ్డాయి. ఫస్టుక్లాసు వచ్చింది, భానుకి ఎం.ఎస్.సి.లో జాయిన్ కావాలని వుంది. తండ్రి ఆర్థిక స్థితిగతులు అనుకూలంగా లేని కారణంగా ఆ ప్రయత్నం విరమించుకుంది. ఉద్యోగాన్వేషణలో తనూ, వరాన్వేషణలో తండ్రి తలమునకలై పోయారు. టైప్ పరీక్షల కెళ్ళి అవి



కూడా పూర్తిచేసింది. అనుకోకుండా ఓ ప్రైవేట్ ఫర్మ్‌లో టైపిస్టు కమ్. ఎల్. డి. సి.గా ఉద్యోగం దొరికింది. శ్రీనివాసమూర్తి గారింటి నలుగురైదుగురు పెళ్ళి కొడుకుల్ని పట్టుకొచ్చాడు. భానుకు వాళ్ళలో ఎవరూ నచ్చలేదని నిర్మొహమాటంగా చెప్పేసింది.

ఎట్టకేలకు కామర్స్, పోస్టుగ్యాడ్యుయేట్‌ని తెస్తే పిల్లాడి అందచందాలు చూసి 'ఓకె' అంది. కాబోయే అత్తమామలు పెళ్ళయితే ఉద్యోగం మానాలని షరతుపెట్టారు. దానికామె ఆయనకు ఉద్యోగం రాగానే మానేస్తానని భరోసా ఇచ్చింది. వివాహం అతి నిరాడంబరంగా జరిగిపోయింది.

ఒకప్రక్క ఉద్యోగం. ఇంకోప్రక్క సంసారం. దానికి తోడు నిత్యం అత్తమామల సాధింపుల మధ్య సుఖాన్న వుండాల్సిన ప్రాణం కష్టాల్లో పడింది. వీటన్నింటికీ తోడు నెల తప్పింది.

శాంత కుమార్తెను తీసుకురమ్మని భర్తని వియ్యాలవారి ఇంటికి పంపింది. వారామెను పంపితే ఇంటిచాకిరీ ఎవరు చేస్తారన్నట్లు పంపడానికి నిరాకరించారు. తానే తెగించి భాను మెటర్నిటీ లీవు పెట్టి తండ్రితో పుట్టింటికి వెళ్ళింది. భర్తకు పౌరుషం దెబ్బతిన్నట్లయి భాను వైపు కన్నెత్తి చూడటం మానేసాడు.

'కథాంజలి'లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితం ఎవరినీ ఉద్దేశించి వ్రాసినవికాదు. రచయితల రచనలకు మేము ఏ మాత్రమూ బాధ్యులు కాదు.

-సంపాదకుడు

భానుకు ఆడపిల్ల పుట్టింది. విషయం తెలిసికూడా అత్తవారింటినుండి ఎవరూ చూడ్డానికి కూడా రాలేదు.

తన బ్రతుకేదో తను బ్రతకాలని నిశ్చయించుకుని హైద్రాబాద్‌లో గవర్నమెంటు పోస్టువస్తే వెళ్ళిపోయింది. కుమార్తె కాపురం చెడినందుకు శాంతమ్మ మంచంపట్టి బెంగతో కన్నుమూసింది. మూర్తి రిటైర్ కాగానే స్థిరచరాస్థుల్ని అమ్ముకుని కూతురి దగ్గర కెళ్ళిపోయాడు.

కాలచక్రంలో రెండు వసంతాలు ముందుకు దొర్లాయి. భాను భర్త అదే ప్రభుత్వ ఆఫీసులో క్లర్క్‌గా జాయిన్ అయ్యాడు. ముందు కాస్త బెట్టుచేసినా నలుగురికీ తమ కథ తెలియడంతో భార్యను చేరదీయడానికి ప్రయత్నాలు కొనసాగించాడు. ఇన్నాళ్ళూ అక్కరలేని భార్య ఇప్పుడు కావలసి వచ్చిందా అంటూ మధ్యవర్తుల్ని నిలదీయటంతో గతిలేక ఓటమిని అంగీకరించి భానుని, బిడ్డని, మావగార్ని తన వాళ్ళుగా ఆహ్వానించాడు. అప్పటికిగాని వారి సంసారంలో కమ్ముకున్న మంచుతెరలు తొలగిపోలేదు. *



Edited and Published by A N. Raghavachar, No. 10, Murugesa Mudali St., Madras-79.
Printed by G. Kulasekaram at Giridhar Art Printers, 47, Badrian Street, Madras-600 001